## క్లుప్తంగా

### విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పెడన: పట్టణంలోని పైడమ్మ దేవస్థానం సమీపంలోని పోరంబోకు స్థలాలోల నివాసం ఉంటున్న కాగిత రాంబాబు(55) ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం దగ్ధమైంది. సిమెంటు గోడలు, తాటాకు కప్పుతో ఉన్న ఇంటికి గురువారం అర్ధరాత్రి మంటలు అంటుకోవడంతో స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50 వేలు నష్టం వాటిల్లింటుందని రెవెన్యూ సిబ్బంది అంచనా. విషయం తెలిసిన తహసీల్దారు కె.రాంబాబు బాధితుడు తెల్లకార్డుదారుడు కావడంతో అతనికి పది కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, రెండు కేజీల గోధుమపిండి, అరకేజీ పంచదారను శుక్రవారం ఉదయం అందజేశారు. వీఆర్వోలు షాకీరుల్లా, ఏసుపాదం ఉన్నారు.

### వాహనాల తనిఖీ

కోడూరు: ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. కోడూరు ప్రధాన సెంటర్, ఉల్లిపాలెం వారధి, కృష్ణాపురం, వి.కొత్తపాలెం ప్రాంతాల్లో పోలీసులు ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ హెడ్ రమేష్ నేతృత్వంలో ఈ తనిఖీలు జరిగాయి. రూ.50 వేలుకు మించి నగదును తీసుకువెళ్తే అందుకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ



మేళ్లమర్రు(మోపిదేవి): మండల పరిధిలోని పలుగ్రామాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల కుటుంబ సభ్యులను అవనిగడ్డ శాసన సభ్యులు సింహాద్రి రమేష్‌బాబు తనయుడు యువనేత సింహాద్రి వికాస్‌బాబు శుక్రవారం పరామర్శించారు. ఉదయం పెదకళ్లేపల్లి శివారు మేళ్లమర్రు దళితవాడలో గృహసారథి దోవారి కుమారి (35) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈమెకు భర్త మునేశ్వరావు, ఒక కుమార్తె ఉన్నారు. ఇదేగ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు కాలిపోయింది. బాధితులు తూము ప్రసాద్ కుటుంబ సభ్యులకు కలసి ధైర్యం కల్పించారు. కూరేటి పాలెంలో ఆకుల నాంచారయ్య (70) ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. ఈయనకు భార్య అరుణ కుమారి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబాలను వారి ఇంటి వద్ద కలిసి ఓదార్చారు. పండలనేని శివప్రసాద్, గ్రామ పార్టీ కన్వీనర్ వెంకటేశ్వరావు, సచివాలయ కన్వీనర్‌లు అరజా వెంకట చలపతిరావు, కళ్లేపల్లి గణేష్ గాంధీ, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### నగరంలో 95.80 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో శుక్రవారానికి 95.80 శాతం మేర వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ జరిగింది. నగరంలో 19,136 పింఛన్లు ఉండగా వీటిలో 18,333 పింఛన్లు పంపిణీ చేశారు. ఇంకా 803 మందికి అందాల్సి ఉంది.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని చిలకలపూడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎం.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఎన్జీవో కాలనీ, విశ్వబ్రాహ్మణ కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఎల్‌ఐసీ కాలనీ, దిమ్మలసెంటర్, భాస్కరపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా గొడుగుపేట, చెమ్మనగిరిపేట, రుస్తుంబాద ప్రాంతాల్లో కూడా ఇదే సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

### వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల నియామకం

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాలను కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్ సీపీ అవనిగడ్డ మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా సైకం నాగబాబుని నియమించారు. క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా గొర్రుముచ్చు రాజేష్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా తోట వీరమ్మ, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా షేక్ ఛాన్ బాషా, పబ్లిసిటీ వింగ్ కమిటీ అధ్యక్షుడిగా గాజుల గజగోపాల్, రైతు విభాగం అధ్యక్షుడిగా బడే బాబూరావు, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా కాకి నాగేశ్వరరావు, స్టూడెంట్ వింగ్ కమిటీ అధ్యక్షుడిగా ఆకునూరు వికాస్, వాణిజ్య విభాగ కమిటీ అధ్యక్షుడిగా గంగిశెట్టి కిరణ్‌కుమార్, వెల్ఫేర్ వింగ్ కమిటీ అధ్యక్షుడిగా మురుగుడి లీలా సాయికుమార్, యూత్ వింగ్ కమిటీ అధ్యక్షుడిగా చింతలపూడి బాలభాస్కరరావు(బాలు), వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడిగా తుంగల లక్ష్మీ నరసయ్య, ట్రేడ్ యూనియన్ కమిటీ అధ్యక్షుడిగా చిల్లర వెంకట శ్రీనివాసరావుని నియమించారు. మొత్తం 13 సంఘాలకు కమిటీలను ఏర్పాటు చేయగా ఒక్కో సంఘానికి 23 మంది చొప్పున కమిటీలను నియమించారు.

# ఆదర్శనీయుడు జగ్జీవన్‌రామ్

- మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి
- పాల్గొన్న నాయకులు, అధికారులు, అభిమానులు
- జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళులు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్, పేర్ని కిట్టు, నాయకులు

పెడన: దివంగత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు ఆదర్శనీయమని పెడన వైఎస్సార్ సీపీఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) అన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మచిలీపట్నం పార్లమెంటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళులర్పించారు. పెడన, గూడూరు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు బూరగడ్డ రమేష్ నాయుడు, సంగా మధుసూధనరావు, సురేష్‌రంగబాబు, మల్లికార్జునరావు, కటకం ప్రసాద్, బండారుఆనందప్రసాద్, కోడూరు శ్రీను పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నగరంలోని గుప్తా సెంటరులో ఆయన విగ్రహం వద్ద శుక్రవారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా సర్వజన ఆసుపత్రి నేత్ర వైద్యనిపుణులు జి.భానుమూర్తి తన సిబ్బందితో కలిసి 135 మందికి నేత్ర పరీక్షలు చేశారు. అధునాతన పరికరం ద్వారా నేత్ర పరీక్షలు చేసి 20 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి సర్వజన ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని వైద్యుడు భానుమూర్తి తెలిపారు.

మచిలీపట్నంటౌన్: దీనజన బాంధవుడు బాబు జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని స్థానిక రామానాయుడుపేటలోని పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాయకులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ఆయన కేక్ కట్ చేశారు. మల్కాపట్నంలోని గుప్తాసెంటరులో, ఓగీస్‌పేటలో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పేర్ని కిట్టు పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్, పేర్ని కిట్టు మాట్లాడారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, కార్పొరేటర్లు ఏకశిరి వెంకటేశ్వరరావు, మాచవరపు రాంప్రసాద్, ఐనం తాతారావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు గూడవల్లి నాగరాజు, బందెల థామస్‌నోబుల్, షేక్ మొహమ్మద్‌సాహెబ్, బూరగ రామారావు, గాజుల భగవాన్, ఎగ్గోని గాంధీ, బడే భాను, మరీదు నాగరాజు, భాస్కర్, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పలు గ్రామాల్లో బాబుజగ్జీవన్‌రామ్ జయింతి ఘనంగా నిర్వహించారు. పెదప్రోలులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి వివిధ హోదాల్లో బడుగు, బలహీనవర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు, మద్దాల వెంకటేశ్వరావు, కొల్లూరి అప్పారావు, కుంపటి వెంకటేశ్వరావు, పలువురు యువకులు పాల్గొన్నారు.

పెడన: బాబుజగ్జీవన్‌రామ్ జయంతి స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెడన, బంటుమిల్లి తహసీల్దార్లు కె.రాంబాబు, వై.రవికుమార్‌లతో పాటు ఎన్నికల విభాగం డీటీ కల్పన, డిప్యూటీ తహసీల్దారు పూర్ణచంద్రరావు, ఆర్ఐ మణికుమార్‌లతో పాటు వీఆర్వోలు నివాళులర్పించారు.

గూడూరు: మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన వేడుకలలో డిప్యూటీ తహసీల్దార్ వై.శివశంకర్, ఆర్ఐ నస్రీన్ అరాలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీఆర్వోలు షేక్ కరీముల్లా, చలమల శెట్టి ప్రసాద్, కుందేటి ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల: పెద్దగూడెంలో జైజీవన్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి గ్రామ పెద్దలు పాల సోమేశ్వరరావు, దిరిశం పిచ్చేశ్వరరావు, బాలకోటయ్య, కొడాలి పోతురాజు పూలమాలలు వేసి నివాళులర్పించగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొడాలి భక్తపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి 200 మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. దిరిశం మహాలక్ష్మణుడు, సీతయ్య, కొడాలి గంగాధరరావు, అమ్మ నాన్న ట్రస్టు డైరెక్టర్ కొడాలి భక్త విజయం, మట్టా బాలకృష్ణ, జై జీవన్ యూత్ సభ్యులు దిరిశం విజయరాజు, కావూరి జయరాజు, మట్టా రామకృష్ణ, కొల్లూరి ఆదిశేషు, దిరిశం రవిబాబు, నడకుదురు రాజీవ్ గాంధీ, దిరిశం శ్రీనివాసరావు, నందేటి శ్రీనివాసరావు, కొడాలి కిషోర్ బాబు, జువ్వనపూడి సుధాకర్, గుర్విందపల్లి శ్యామారావు పాల్గొన్నారు. దేవరకోట గ్రామంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి గ్రామస్తులతో కలసి దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. కొడాలి నాంచారయ్య, ప్రభాకరరావు, ఓలేటి రవీంద్ర, ముదునూరి కోటేశ్వరరావు, మట్టా రవి, ఓలేటి వినోదరావు, కొడాలి పోతురాజు, కొక్కిలిగడ్డ వరుణ్ పాల్గొన్నారు. శ్రీకాకుళం శివారు సూరపనేని పాలెంలో జయంతిని ఎమ్మార్పీఎస్ నేత కొడాలి డేవిడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాచూరి యెహాను, కొడాలి నాగార్జున, చిట్టూరి కోటేశ్వరరావు, నిత్యానందం, పెనుమత్స జార్జి, పోలిమెట్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మంగళాపురం(చల్లపల్లి): దివంగత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ కేంద్ర ప్రభుత్వంలో అనేక శాఖలకు మంత్రిగా ఆ పదవులకు వన్నె తెచ్చేలా పని చేశారని ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మంగళాపురంలో జగ్జీవన్ జయంతి ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ విగ్రహానికి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మీపురం శివారు రామానగరంలో సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు జగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఘంటసాల పెద్దగూడెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జైజీవన్ యూత్, పెద్దలు



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమేష్ (రాము), చంద్రశేఖరరావు, హారిక తదితరులు



పెదప్రోలులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సురేష్‌బాబు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు భానుమూర్తి



గూడూరు తహసిల్దార్ కార్యాలయంలో..



పెడన తహసీల్దార్ కార్యాలయంలో..



అవనిగడ్డలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: దివంగత ఉపప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి, ఎనిమిదవ వార్డు వద్ద జగ్జీవన్‌రామ్, భారతరత్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపప్రధానగా, మంత్రిగా దేశానికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మద్ది చిన్నా, చింతలపూడి బాలుతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### సద్గుణాల సంఘ సంస్కర్త

కోనేరుసెంటర్: నవతావాదం, ఆదర్శవాదం, స్థితిస్థాపకత వంటి సద్గుణాలు కలిగిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకటేశ్వరరావు కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్, ఇతర అధికారులు, ఎస్పీ కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీలు వెంకటేశ్వరరావు, ప్రసాద్



దేవరకోటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు

# ప్రజలు ఇబ్బందులు పడే రాజకీయాలు చేయొద్దు

- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు
- వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం
- బంటుమిల్లిలో ప్రజాదీవెనలో చైర్‌పర్సన్ హారికరాము



డాక్టర్ చంద్రశేఖరరావు, రాము, హారికలకు స్వాగతం పలుకుతున్న నాయకులు

బంటుమిల్లి: ప్రజలు ఇబ్బందులు పడే రాజకీయాలు చేయొద్దని మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టరు సింహాద్రి చంద్రశేఖరరావు హితవు పలికారు. శుక్రవారం స్థానిక లక్ష్మీపురం సెంటర్లో వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయాన్ని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము)తో కలసి ఆయన సంప్రదాయ పద్దతిలో ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లు ప్రజలకు సేవచేసి అందరి మెప్పు పొందారని, న్యాయస్థానాలు సైతం అంగీకరించాయని, అలాంటిది వారిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వారి సేవలను అడ్డుకున్నారన్నారు. పింఛన్ల కోసం సచివాలయాల వద్ద పడిగాపులు పడే స్థితి తీసుకువచ్చిన చంద్రబాబు అండ్ కోను ప్రజలు క్షమించరని విమర్శించారు. ఇది టీడీపీ నాయకులు చేసిన అతిపెద్ద తప్పు అని చంద్రశేఖరరావు పేర్కొన్నారు. మా తండ్రిగాని, రాము తండ్రిగాని అవినీతిలేకుండా నీతి,నిజాయితీలతో రాజకీయం చేశారని, వారి స్ఫూర్తిగా మొదటిసారి మీ ముందుకు వచ్చామని ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ప్రజా సేవ చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. తన కోరికమేరకు ముఖ్యమంత్రి మచిలీపట్నానికి మెడికల్ కాలేజీ మంజూరు చేసినట్లు బందరు ఎమ్మెల్యే పేర్ని నాని కృషితో కాలేజీ ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని చంద్రశేఖరరావు పేర్కొన్నారు. దివంగత నాయకులు ఎన్టీఆర్, వైఎస్సార్ తర్వాత రాష్ట్రంలో ఈ స్థాయిలో సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందంటూ పథకాలను ఉదహరించారు.

**తాగునీటికి రూ.35 కోట్లు కేటాయింపు**

పెడన నియోజకవర్గంలో గత పాలకులు చేసిన నిర్లక్ష్యం కారణంగా మంచినీరు లేని పరిస్థితులు నెలకొన్నాయని, దీని పరిష్కారం కోసం జెడ్పీ నుంచి రూ.35 కోట్లు కేటాయించామని ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము)అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకంతో నియోజకవర్గం అంత పర్యటించి ప్రధాన సమస్యగా ఉన్న తాగునీటికి తొలి ప్రాధాన్యత ఇచ్చానన్నారు. తాగునీరు ఇచ్చి ఓట్లు అడగడానికి వస్తానని చెప్పినందున ప్రతి గ్రామానికి నిధులు మంజూరు చేసి ఫిల్టర్లు, బోర్లు, ట్యాంకర్ల ద్వార తాగునీరు అందజేస్తున్నామని రాము తెలిపారు. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడే కుటుంబం నుంచి వచ్చానని నిజాయితీతో ప్రజాసేవ చేసేందుకు మొదటిసారి పోటీ చేస్తున్నందున ఒక అవకాశం ఇవ్వాలని రాము కోరారు.

**అన్నా ఒకసారి అవకాశం ఇవ్వండి..**

ఎమ్మెల్యేగా మీకు ఎప్పుడు అందుబాటులో ఉంటాను అన్నా.. నాకు ఒకసారి అవకాశం ఇవ్వండి.. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలంటూ గ్రామస్తులకు కరపత్రాలు అందజేసి చేతులు జోడించి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే అభ్యర్థి రాము ఓట్లు అభ్యర్థించారు. ప్రజాదీవెన కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి డాక్టరు సింహాద్రి చంద్రశేఖరరావుతో కలసి హారికరాములు పాల్గొన్నారు. తొలుత స్థానిక నాయకులు వారికి శాలువాలు కప్పి ఘనస్వాగతం పలికారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన తర్వాత వారిని గజమాలతో ఊరేగించారు. ఎంపీపీలు వి.చినబాబు, కె.గరుడ ప్రసాదు, ఎస్.మదుసూధన్‌రావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు టి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీలు ఎం.వెంకటరమణ, ఎం.రత్నకుమారి, ఆర్టీసీ కృష్ణా రీజియన్ చైర్మన్ పి.మహేష్, ఏఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్ కె.గంగాధర్, పి.బాబూరావు, పీఏసీఎస్ చైర్మన్లు జి.శేషగిరి, బి.రాంబాబు, కె.లక్ష్మాజీ, సర్పంచ్‌లు బి.చంద్రశేఖర్, పి.సతీష్, ఎంపీటీసీలు ఎండి.కమాల్‌బాషా, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.మహేష్, నాగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పి.నాగేశ్వరరావు నాయకులు బూరగడ్డ శ్రీకుమార్, ఎం.నాగబాబు, సీహెచ్.రాధకృష్ణ, కె.మహంతి, బి.గాంధి, ఎస్. జనార్ధన్‌రావు, సీహెచ్. నాగేశ్వరరావు, పి.పుష్ప, ఝాన్సీ, జి.ప్రసన్నకుమారి, హసీనా, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి..అందుబాటులో ఉంటా



వృద్ధురాలితో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: పెద్ద మనసుతో ప్రజలంతా ఆశీర్వదిస్తే అనుక్షణం అందరికీ అందుబాటులో ఉంటానని వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు తెలిపారు. బందరు మండలం తాళ్లపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన గడప గడపకు సంక్షేమం కార్యక్రమంలో కిట్టు ఇంటింటికీ తిరిగి ప్రజలతో మమేకమయ్యారు. ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒక్కసారి అవకాశం ఇస్తేనే ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరొక్కసారి ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర అభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రజల సంక్షేమానికి మరింత కృషి చేస్తారన్నారు. పెన్షన్ల పంపిణీ విషయంలో చంద్రబాబు నాయుడు చేస్తున్న కుట్రలు అన్నీ ఇన్ని కావన్నారు. పేర్ని నాని వారసుడిగా ఎన్నికల్లోకి దిగుతున్నతనను ప్రజలంతా ఆశీర్వదించి అఖండ మెజారిటీతో గెలిపిస్తారని ఆశిస్తున్నానని చెప్పారు. వాలిశెట్టి రవిశంకర్, సర్పంచ్ అశ్విని, శ్రీకాకుళపు నాగేశ్వరరావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి నుంచి అమ్మవారి జాతరోత్సవం

కోడూరు: స్థానిక గంగాభవానీ అమ్మవారి ప్రధాన జాతరోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు కోడూరు పోలీసులు అమ్మవారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి తొలిపూజ చేసేందుకు స్టేషన్‌ను ముస్తాబు చేశారు. స్టేషన్‌లో పూజల అనంతరం అమ్మవారి గ్రామోత్సవాన్ని ప్రారంభించనున్నారు.

**నేడు పోలీస్‌స్టేషన్‌లో తొలి పూజలు..**

జాతరోత్సావాల ప్రారంభం రోజున అమ్మవారిని తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి తొలిపూజలు చేయాలని అప్పట్లో తీర్మానించారు. ఎస్ఐ ఏవీఎస్ రెడ్డి చేసిన తీర్మానానికి గ్రామస్తులు కూడా అంగీకరిం చడంతో అప్పటి నుంచి నేటి వరకు అమ్మవారికి కోడూరు పోలీస్‌స్టేషన్ ఆఫీసర్‌గా ఉండే అధికారి తొలిపూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం ఉదయం చిన్న అమ్మవారిని పోలీసు లాంఛనాలతో స్టేషన్‌కు తీసుకువెళ్లనున్నారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో నియోజకవర్గానికి చెందిన పోలీసులు అమ్మవారిని డప్పువాయిద్యాల, నడుమ ఊరేగింపుగా స్టేషన్‌కు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్టేషన్‌ను నూతన రంగులతో తీర్చిదిద్ది, టెంట్లు ఏర్పాటు చేశారు. పోలీసు స్టేషన్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అవనిగడ్డ సీఐ త్రినాథ్, కోడూరు ఎస్ఐ శిరీష పర్యవేక్షణలో తొలిపూజలు నిర్వహించనున్నారు.

**10న ప్రధాన గుడిజాతర..**

పోలీసుల తొలిపూజలకు ముందు అమ్మవారికి పుట్టింటివారైన కంచర్లపల్లి వంశీయులు పసుపు, కుంకుమను సమర్పిస్తారని ధర్మకర్త కోట యుగంధరరావు తెలిపారు. అనంతరం స్టేషన్‌లో పూజలు చేసి, గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. కోడూరుతో పాటు శివారు గ్రామాలైన స్వతంత్రపురం, దింటిమెరక, మెరకగొడపాలెం, కృష్ణాపురం, యర్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్ బేగ్‌పేట గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవం కొనసాగుతుందని యుగంధరరావు తెలిపారు. 9న పసువుల జాతర, 10న అమ్మవారి ప్రధాన గుడి జాతరను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు.

# మద్యం అక్రమ నిల్వలు..రవాణాపై నిఘా పెంచండి

పెడన ఈఆర్వో వెంకటరమణ




మాట్లాడుతున్న ఈఆర్వో వెంకటరమణ, పక్కన ఐలయ్య, రమేష్‌బాబు

పెడన: మద్యం అక్రమ నిల్వలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని, ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు గురికాకుండా సీజ్ చేయాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.వెంకటరమణ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలోని తన ఛాంబరులో పెడన నియోజకవర్గంలోని ఎనిమిది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు ఎక్సైజ్, పోలీస్ సిబ్బందితో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఐలయ్య, ఎన్నికల పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి డీఎస్పీ రమేష్‌బాబులతో కలిసి ఈఆర్వో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ సారా తయారు చేస్తున్న వారిని కూడా గుర్తించి ముందస్తు చర్యల్లో భాగంగా వారిని అదుపులోకి తీసుకునే అవకాశాలను పరిశీలించాలన్నారు. పలుమార్లు ఇప్పటికే అరెస్టులు అయిన నేపథ్యంలో వారిని అదుపులోకి తీసుకునే ఛాన్స్ ఉంటాయోమో చూడాలన్నారు. మద్యం దుకాణాల నుంచి అధిక మొత్తంలో మద్యం సీసాలు విక్రయించవద్దని, సిబ్బందికి ఈ విషయాన్ని సూచించాలన్నారు. ఒక సీసాకు మించి అమ్మకూడదనే విషయాన్ని తెలియజేయాలని, అంతకు మించి అమ్మితే దుకాణాదారుడిని కూడా అదుపులోకి తీసుకోవచ్చని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఐలయ్య స్పష్టం చేశారు. మద్యం విక్రయించిన తరువాత నగదును బ్యాంకులలో జమ చేయడానికి దుకాణాదారులు వెళ్తుంటారని, వారిని పట్టుకుంటున్నారని అన్నారు. వారికి గుర్తింపు కార్డులు జారీ చేశామని, వాటిని చూపిస్తే బ్యాంకులో జమ చేయడానికి అనుమతులు ఇవ్వాలని ఈఎస్ సూచించారు. బెల్టు దుకాణాలకు మద్యం పోనీయకుండా అరికట్టాలన్నారు. అలా వెళ్లినా కూడా సంబంధిత దుకాణాలపై కేసులు నమోదు చేయాలని సూచించారు. అవసరమైతే సిబ్బందిని కూడా అరెస్ట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఏఈఆర్వో పెడన తహసీల్దారు కె.రాంబాబు, పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రప్రసాద్, నాలుగు మండలాలకు చెందిన ఎస్ఐలు, ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవాసవి క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం

పెడన: పట్టణంలోని శ్రీవాసవి క్షేత్రంలో శ్రీవాసవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరిగి 50 సంవత్సరాలైన (స్వర్ణోత్సవం) సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి క్షేత్రంలో తొలిసారిగా మహాకుంభాభిషేకం, విగ్రహాల పునః ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. చివరి రోజు శుక్రవారం సామూహిక మహా కుంభాభిషేకం పూజా కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయ (చిన్నా), మంజులత దంపతులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా, పద్మ దంపతులు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు జల్లూరి రామ్మోహన్‌రావు పార్వతీదేవి, కప్పలదొడ్డి ఆర్యవైశ్య ప్రముఖులు ఆలపాటి ఆనందవిఠల్, ధనలక్ష్మి, మండవల్లి అమ్మనేశ్వరరావు భవానీ దంపతులచే పూజా కార్యక్రమాన్ని స్వర్ణ శ్రీనివాస్ శర్మ, శ్రీవాసవి క్షేత్రం ప్రధాన అర్చకుడు స్వర్ణ సాయిబాబులతో పాటు 25 మంది భక్తిశ్రద్ధలతో నిర్వహింపజేశారు. భారీ అన్న సమారాధన చేశారు. సురేష్ కుమార్, వెంకట పూర్ణ ప్రదీప్ గుప్త, పశుపతినాథ్ బాబు, నరసింహారావు, శ్రీనివాస్ గుప్తా, నాగు, రమేష్, కుమార్,ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

### ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

చల్లపల్లి: గ్రామంలోని నారాయణరావు నగర్ కాలనీలో ఉన్న ముస్లింల ఖబరస్తాన్ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. మస్జీదు కమిటీ అధ్యక్షుడు ఎస్ఎంఏ సయ్యద్ షరీఫ్ ఆధ్వర్యంలో కమిటీ ద్వారా సమీకరించిన కొద్దిపాటి నిధులతో ప్రహరీ నిర్మాణ పనులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు.